# పవన్‌ను రాష్ట్రం నుంచి బహిష్కరించాలి

- ఎక్కడికక్కడ నిరసన తెలుపుతూ.. దిష్టిబొమ్మలు దహనం చేసిన వలంటీర్లు
- వ్యాఖ్యలు వెనక్కు తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్



తగరపువలస అంబేడ్కర్ కూడలిలో పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

**తగరపువలస:** రాష్ట్రం పట్ల, మహిళల పట్ల, వలంటీర్లపై గౌరవం లేని పవన్ కల్యాణ్‌ను రాష్ట్రం నుంచి బహిష్కరించడమే కాకుండా, అతని సినిమాలపై బ్యాన్ విధించాలని జీవీఎంసీ భీమిలి జోన్ వలంటీర్లు డిమాండ్ చేశారు. అంబేడ్కర్ కూడలిలో మంగళవారం రాస్తారోకో నిర్వహించి పవన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వలంటీర్లను కించపరచిన పవన్ వ్యాఖ్యలు వెనక్కు తీసుకుని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బింగి హరికిరణ్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాల పాలనలో వంద పైరవీలు, వేలాది రూపాయలు చేతులు తడిపితే తప్ప సంక్షేమ పథకాలు అందేవి కాదన్నారు. ప్రపంచానికే మార్గదర్శకంగా ఉన్న వలంటీర్ వ్యవస్థపై పచ్చ మందకు కంటగింపుగా ఉండి, సహనం కోల్పోయి మాట్లాడుతున్నారన్నారు. ఈ సందర్భంగా పవన్ దిష్టిబొమ్మను కూడలిలో దహనం చేశారు. కార్యక్రమంలో ఆర్.ప్రభాకర్‌నాయుడు, నీలాపు సురేష్‌రెడ్డి, కొంకి వెంకటేష్, కొయ్య రామకృష్ణ, దొడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**జనసేన కవ్వింపు చర్యలు..**

అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలియజేస్తున్న వలంటీర్లపై జనసేన కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వలంటీర్లను పిల్ల సైనికులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయగా వైఎస్సార్‌సీపీ నాయకులు రావడంతో అక్కడి నుంచి తోక ముడిచారు.



మారికవలసలో పవన్ దిష్టిబొమ్మతో జీవీఎంసీ 5వ వార్డు పరిధిలోని వలంటీర్లు

**పవన్ వ్యాఖ్యలపై వలంటీర్ల ఆగ్రహావేశాలు**

**మధురవాడ:** వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మధురవాడలోని పలు ప్రాంతాల్లో గల వలంటీర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవీఎంసీ 5, 6, 7 వార్డుల్లో మంగళవారం పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీలో వలంటీర్లు మానవహారంగా ఏర్పడి, పవన్ పోస్టర్ పట్టుకుని డౌన్‌డౌన్ ప్యాకేజీ స్టార్, దత్తపుత్రుడు, నిత్య పెళ్లి కొడుకు అంటూ నినాదాలు చేశారు. అనంతరం పవన్ పోస్టర్‌ను చెప్పుతో కొట్టి దహనం చేశారు. తాము సేవా దృక్పథంతో గౌరవ వేతనం తీసుకుని పని చేస్తున్నామని చెప్పారు. తక్షణమే క్షమాపణ చెప్పాలని, లేకపోతే వలంటీర్ల కుటుంబాలు తగిన బుద్ధి చెబుతాయని ప్రసన్న శైలజ, రమేష్ హెచ్చరించారు. కార్యక్రమంలో దేవి, రాజశేఖర్, రత్నం, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 6వ వార్డుకి చెందిన వలంటీర్లు మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. పవన్‌కి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వలంటీర్లు భారతి, అనురాధ, హారిక, శంకర్, తబిత, వాసంతి, రామోజీ, ఎస్‌కే రహీనా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
- మారికవలస హైవేపై జీవీఎంసీ 5వ వార్డుకి చెందిన పలువురు వలంటీర్లు పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను ఊరేగించి, చెప్పులతో కొట్టారు. అనంతరం పవన్ దిష్టి బొమ్మతోపాటు పవన్ ఫొటోతో ఉన్న ప్లకార్డులను దహనం చేశారు. వలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాల్సిందేనని నినాదాలు చేశారు. హేమంత్, బుజ్జి, పృధ్వీరాజ్, పవన్ కుమార్, కృష్ణ, శివశంకర్, దేవి, నాగరత్నం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వలంటీర్లు



మధురవాడ సమీప వాంబేకాలనీలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న వలంటీర్లు

# ఓర్వలేకే ప్రతిపక్షాల ఆరోపణలు

**తగరపువలస:** గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య పరిపాలనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి వలంటీర్లతో ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నాయని లబ్ధిదారులు, వలంటీర్లు మండిపడుతున్నారు. ప్రారంభంలో చంద్రబాబు, ఇప్పుడు పవన్ కల్యాణ్ వలంటీర్లపై చేస్తున్న వ్యాఖ్యలు చూస్తుంటే ఇది ఖచ్చితంగా కండకావరంతోనే చేసినట్టు అనిపిస్తోందని ధ్వజమెత్తుతున్నారు. పవన్ మతి తప్పి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పేవరకు వెనక్కు తగ్గేది లేదని వలంటీర్లు అంటున్నారు.



తగరపువలసలో వలస కార్మికులకు పండ్లు, బిస్కెట్లు, డ్రింక్స్ పంపిణీ చేస్తున్న కొండపేట వలంటీర్లు (ఫైల్)

## మిడిసిపాటు తగదు



సినిమాలు వేరు.. నిజ జీవితం వేరు అని పవన్ గ్రహించాలి. చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్‌తో జనం మధ్య మిడిసిపాటుతో మాట్లాడుతున్నాడు. వలంటీర్ల సేవలపై కుటిల వ్యాఖ్యలు అతని అజ్ఞానానికి నిదర్శనం. ఇలాంటి వ్యక్తులు రాజకీయాలకు పనికిరారు.

– చిల్ల త్రినాథరెడ్డి, వలంటీర్, బొగ్గురోడ్డు – 2 సచివాలయం

## పిచ్చాస్పత్రిలో చేర్పించాలి



బహిరంగ వేదికలపై పవన్ మాట్లాడుతున్న తీరు చూస్తుంటే అతనికి పిచ్చి పట్టినట్టు అనిపిస్తోంది. తక్షణమే అతని కుటుంబ సభ్యులు లేదా పిల్ల సైనికులు వైజాగ్ పిచ్చాస్పత్రికి తరలించి చికిత్స అందించాలి. లేదంటే రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటారు.

– కొంకి వెంకటేష్, వలంటీర్, భీమునిపట్నం

## ప్రతిపక్షాలవి అర్థం లేని ఆరోపణలు



14 ఏళ్లు ముఖ్యమంత్రిగా వెలగబెట్టిన చంద్రబాబు ప్రజలకు చేసిన మేలు సున్నా. ఇప్పుడు జగన్ బాబు ముఖ్యమంత్రిగా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు చూసి చంద్రబాబుతోపాటు పవన్ కడుపుమంటతో వలంటీర్లను దూషిస్తున్నారు. వలంటీర్లే లేకపోతే మాలాంటి వారి పరిస్థితి ఎలా ఉండేదో.

– చేట్ల లక్ష్మి, పింఛనుదారు, సంతపేట

## ఒంటరి మహిళలపై చిన్నచూపు



జగన్ బాబు ముఖ్యమంత్రిగా ఉన్నంత వరకు ఒంటరి మహిళలు ఎప్పుడూ ఒంటరి వారు కాదన్న విషయం పవన్ గ్రహించాలి. పవన్ ముందుగా మహిళలను గౌరవించడం నేర్చుకోవాలి. దుర్బుద్ధితో మహిళలను కించపరిస్తే చెప్పులతో సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

– సీహెచ్.సరస్వతి, ఒంటరి మహిళ, చిట్టివలస

# పవన్ స్పృహ తప్పి మాట్లాడుతున్నాడు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

**కొమ్మాది:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పృహ తప్పి మాట్లాడుతున్నాడని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్, రుషికొండ ప్రాంతాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో అనేక సేవలు అందించిన వలంటీర్లపై పవన్ కల్యాణ్ దిగజారుడు మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వలంటీర్ వ్యవస్థను ప్రధాని నరేంద్ర మోదీ మెచ్చుకున్నారని, అలాంటిది పవన్ కల్యాణ్ విమర్శించడం ఏమిటన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు చేసిన అవినీతిపై ఎందుకు ప్రశ్నించలేదన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారన్నారు. సంక్షేమాన్ని అందించే ప్రభుత్వం కావాలా..?, సంక్షోభంలోకి నెట్టే ప్రభుత్వం కావాలా..? అని ప్రజలను ప్రశ్నించారు. ఈ వార్డులో 23 రకాల పథకాల ద్వారా రూ.54 కోట్లు ఇక్కడి ప్రజలకు అందించామని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, లొడగల రామ్మోహన్, ఉప్పులూరి గోపి, అల్లాడ ఉమామహేశ్వరరావు, చెన్నాదాసు, రమణమూర్తి, మాదు చంటి, బుజ్జి, శ్రీనివాసరెడ్డి, సీరపు వంశీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మంచినీటి సరఫరా విభాగం ఏఈగా సురేష్



ఏఈ సురేష్

**భీమునిపట్నం:** భీమిలి పరిధిలో జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగ ఏఈగా జి.సురేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జీవీఎంసీ పార్కులు, క్రీడా మైదానాల పర్యవేక్షణ విభాగం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు చేపడతానని, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరిస్తానని వెల్లడించారు.

### అందుబాటులో వరి విత్తనాలు

**పద్మనాభం:** మండలంలోని రైతులకు సరఫరా చేయడానికి ఏడు ఆర్బీకేల్లో వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ శాఖ మండల అధికారి ఎంవీఎస్ చలం తెలిపారు. అనంతవరంలో 1121 రకం వంద బస్తాలు, బాందేవుపురంలో 40, పొట్నూరులో 134, రెడ్డిపల్లిలో 40, తునివలసలో 25, సోనామసూరి రకం 67 బస్తాలు, పాండ్రంగిలో 1121 రకం 67 బస్తాలు, రేవిడిలో 17 బస్తాలు ఉన్నాయని తెలిపారు. ఈ కేంద్రాలకు అదనంగా రెండో విడత విత్తనాలు తీసుకొచ్చినట్టు ఆయన తెలిపారు. 1121 రకం రూ.985, సోనామసూరి రూ.970కు రైతులకు సరఫరా చేస్తామన్నారు. కావాల్సిన రైతులు సంబంధిత ఆర్బీకేలకు ఆధార్ కార్డులు పట్టుకుని వెళ్లాలని ఆయన కోరారు.

### శాకంబరిగా బబ్బేలమ్మ అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో బబ్బేలమ్మ అమ్మవారు

**పీఎం పాలెం :** కారుషెడ్ కూడలికి సమీపంలోని బబ్బేలమ్మ అమ్మవారిని మంగళవారం స్థానిక భక్తులు కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని వేప ఆకుల తోరణాలతో అలంకరించారు. నాయకులు పోతిన శ్రీనివాసరావు, బాలాజీ పాల్గొన్నారు.

### జగనన్న సురక్ష నేడు

**ఆనందపురం :** మండలంలోని గిడిజాల, కణమాం గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొంటారని, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### జమ్మిచెరువు పార్కులో అభివృద్ధి పనులు



వాకింగ్ ట్రాక్ పనులు చేస్తున్న సిబ్బంది

**భీమునిపట్నం:** భీమిలి నుంచి తగరపువలసకు వెళ్లే రోడ్డు పక్కన ఉన్న జమ్మి చెరువు పార్కులో అధికారులు రూ.85 లక్షలతో ఆధునీకీకరణ పనులు చేపట్టారు. ఇక్కడి విశాలమైన చెరువు చుట్టూ గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో పాముల బెడద తీవ్రంగా ఉంది. అభివృద్ధి పనుల్లో భాగంగా వీటిని పూర్తిగా తొలగించారు. చెరువు చుట్టూ రక్షణగా ఇనుప కంచె ఏర్పాటు చేయనున్నారు. అలాగే రోజూ ఈ పార్కులో ఉదయం, సాయంత్రం వచ్చే వాకర్స్ కోసం వాకింగ్ ట్రాక్ సిద్ధం చేస్తున్నారు. పాడైపోయిన పిల్లల ఆట వస్తువుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. మరుగుదొడ్లు, ఇతర సదుపాయాలు కల్పించనున్నారు. త్వరలో పార్కు సుందరంగా అందుబాటులోకి రానుందని అధికారులు అంటున్నారు.

# అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యం



లక్ష్మీపురం పంచాయతీలో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

**తగరపువలస:** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడానికి, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీలో మంగళవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలో విజయరాంపురం, కరగానిపేట, ముగడపేట, కాళ్ల వారి కళ్లాలు, యాతపేట గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సమస్యలు, సంక్షేమ ఫలాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే సమస్యలను అధికారులకు వివరించి పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. కాళ్లవారి కళ్లాలకు రోడ్డు సదుపాయం, విజయరాంపురంలో డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాల మార్పు, శ్మశానవాటికకు గ్రావెల్ రహదారులు, తాగునీటి సమస్యకు వాటర్ ట్యాంకు నిర్మించాలని పంచాయతీ వాసులు ఎమ్మెల్యేను కోరారు. వీటి పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, నమ్మి లక్ష్మణ, కరుభుక్త అప్పలనారాయణ, గాడు వెంకట నారాయణ, గాడు తాతినాయుడు, గుడ్డాల ఎల్లయ్య, భాగం సుధాకర్, పూసర్ల ఎర్రయ్య, కనకల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఈయూ ఆవిర్భావ దినోత్సవం



మధురవాడ డిపో వద్ద కేక్ కట్ చేస్తున్న నాయకులు

**మధురవాడ:** కార్మిక హక్కులు, ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం రెండు కళ్లుగా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) పనిచేస్తోందని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రామారావు చెప్పారు. యూనియన్ 72వ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం మధురవాడ ఆర్టీసీ డిపో వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు వాండ్రాసి రవికుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు, మధురవాడ ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ డి.చిన్నారావు, కార్యదర్శి కె.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# క్లాప్ వాహనాలకే చెత్త ఇవ్వాలి



స్థానికులతో మాట్లాడుతున్న భీమిలి జెడ్సీ రాము

**తగరపువలస:** జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు ఆదర్శనగర్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా స్థానికులతో జెడ్సీ బి.రాము మంగళవారం మాట్లాడారు. వార్డులో డ్రైనేజీలకు త్వరలో మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. 2016 నుంచి జరుగుతున్న స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ముఖ్యమైన నగరాల్లో పరిశుభ్రతకు సంబంధించి ర్యాంకులు ఇస్తారని, దీనికి ప్రజలంతా సహకరించాలని కోరారు. తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తను వేరు చేసి క్లాప్ వాహనాలకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, చిప్పాడ వెంకటేష్, బింగి హరికిరణ్‌రెడ్డి, చేట్ల నరసింగరావు, సరగడ నాగిరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

**4వ వార్డులో జెడ్సీ పర్యటన**

**కొమ్మాది:** జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెంలో మంగళవారం ఉదయం జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు పర్యటించారు. ఈ ప్రాంతంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు పరిశీలించిన అనంతరం స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని, చెత్తను క్లాప్ వాహనాలకే అందించాలని తెలిపారు. పాలిథిన్ కవర్లు వినియోగించరాదని, దుకాణాల్లో మరే ఇతర స్థలాల్లో కవర్లు వినియోగించినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

# బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేయాలి



వరి విత్తనాల శుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**పద్మనాభం:** బీజామృతంతో వరి విత్తనాలు, నవధాన్యాలను శుద్ధి చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారులు వనజ, అనురాధ సూచించారు. మండలంలోని గంధవరంలో బీజామృతం తయారీపై మహిళా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆవు పేడ, ఆవు మూత్రం, పుట్ట మన్ను, కిల్లీ సున్నంతో బీజామృతం తయారు చేసుకోవచ్చని సూచించారు. విత్తనాలు శుద్ధి చేయడం వల్ల తెగుళ్లను నియంత్రించవచ్చని, మొలక శాతం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ సతీష్ పాల్గొన్నారు.

# మంచి పశుగ్రాసంతో అధిక పాల దిగుబడి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కరుణాకర్‌రావు

**ఆనందపురం :** పశువులకు మంచి పశుగ్రాసం అందిస్తే అధిక పాల దిగుబడి సాధించవచ్చని పశు సంవర్ధక శాఖ డీడీ ఎన్.కరుణాకర్‌రావు సూచించారు. మండలంలోని బోని గ్రామంలో మంగళవారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రావు మాట్లాడుతూ మంచి పోషకాలు ఉండే సూపర్ నేపియర్, ఆస్ట్రేలియన్ రెడ్ నేపియర్, గినీ గడ్డి, పారా గడ్డి వంటి రకాలు పండించి పాడి పశువులకు మేతగా వేస్తే అధిక పాల దిగుబడి సాధించవచ్చని వివరించారు. అలాగే ఎక్కువ విస్తీర్ణంలో పండిస్తే వాటిని విక్రయించి రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని చెప్పారు. గడ్డి విత్తనాలను రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. గడ్డి సాగు విధానం, పశువులకు మేపు పద్ధతులను వివరించారు. అలాగే రాయితీపై రాష్ట్ర ప్రభుత్వం అందించే గడ్డి కోసే యంత్రాలు, సమీకృత పౌష్టికాహారం, పశు బీమా పథకాలపై అవగాహన కలిగించారు. వైఎస్సార్ సంచార పశు వైద్యశాల ద్వారా వైద్య సేవలు పశువుల శాలలు వద్దే అందిస్తున్నారని, రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు గడ్డి విత్తనాలు, సమీకృత పౌష్టికాహారం ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, సర్పంచ్ బోని అప్పలకొండ, ఏడీ ఎం.ప్రసాదరావు, పశువైద్యాధికారులు లీలారాణి, కన్నయ్యనాయుడు పాల్గొన్నారు.

# ప్రగతికి అధిక జనాభా అవరోధం



ర్యాలీ నిర్వహిస్తున్న బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు



మధురవాడలో ర్యాలీలో వైద్యులు, సిబ్బంది

**ఆనందపురం :** అధిక జనాభా వల్ల సమాజంలో పలు సమస్యలు తలెత్తుతాయని ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి షేక్ షహనాజ్ సాధియా చెప్పారు. ఆనందపురంలో మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సామాజిక ఆరోగ్యాధికారి సాంబమూర్తి పాల్గొన్నారు.

**భీమునిపట్నం:** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.అనురమ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎకనామిక్స్ విభాగ అధిపతి డాక్టర్ ఎం.రమణ మాట్లాడుతూ అధిక జనాభా వల్ల ఆర్థిక భారం ఎక్కువవడంతో అందరూ ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. అధ్యాపకులు రాజేశ్వరరావు, మాధురి, ఉమామహేశ్వరరావు, జ్యోతి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

**తగరపువలస:** అధిక జనాభా కారణంగా ప్రపంచ దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.అప్పలరాజు అన్నారు. మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అధిక జనాభా వల్ల కలిగే అనర్థాలపై బంగ్లామెట్టపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు ఎస్.రమేష్, బి.మల్లిక, పి.నాగమణి పాల్గొన్నారు.

**మధురవాడ:** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఎస్.ప్రశాంతి, పి.దీపిక ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. జనాభా నియంత్రణ భావితరాలకు ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసాద్, ఎంపీహెచ్‌ఈవో ఆచార్యులు, సీహెచ్‌వో సౌభాగ్యమణి, పీహెచ్‌ఎన్ సత్యవతి, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

# 50 మందికి నేత్ర వైద్య పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

**ఆనందపురం :** మండలంలోని ముచ్చర్లలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 50 మందికి పరీక్షలు నిర్వహించారు. అందులో 10 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి ఉచితంగా ఆపరేషన్లు చేయించడానికి నిర్ణయించారు. మిగతా వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ షిణగం యర్రయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి శిబిరాలు నిర్వహించడం వల్ల పేదలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గుసిడి ముత్యాలు, ఆర్‌పీ నాయుడు, సాయి కుమార్, ఎంవీఎస్ సాయికుమార్, ఎ.అప్పలరాజు, కంటి ఆస్పత్రి వైద్యుడు సాయికృష్ణ పాల్గొన్నారు.

# అకాల వర్షంతో రోడ్లు జలమయం



కారు షెడ్ కూడలి సర్వీసు రోడ్డులో నిలిచిపోయిన నీరు

**పీఎం పాలెం:** పీఎంపాలెంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కురిసిన అకాల వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. అంతవరకూ పొడిగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. నీలిమబ్బులు అలుముకుని సుమారు గంట సేపు భారీ వర్షం కురిసింది. అనంతరం వాతావరణం మళ్లీ పొడిగా మారిపోయింది. ఈ వర్షానికి పాదచారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కారుషెడ్ కూడలిలోని సర్వీసు రోడ్డులో వర్షం నీరు నిలిచిపోయింది. వర్షం కురినా తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడ్డారు.